"రాజధానిలో సామూహిక యజ్ఞం చేద్దాం. అక్కడికి హాజరయ్యే ప్రజల్లో కనీసం ఒక్కరికైనా దైవం మీద పరిపూర్ణ నమ్మకం వుంటేచాలు. వర్షాలు కురుస్తాయి."

ఆయన సూచించిన ప్రకారం రాజు యజ్ఞానికి అన్ని ఏర్పాట్లు చేసాడు. పీఠాధిపతి స్వయంగా వచ్చి ఆ యజ్ఞాన్ని నిర్వహించాడు. వేలమంది ప్రజలు దానికి హాజరయ్యారు. యజ్ఞం పూర్తవుతున్నా వర్షపు సూచనలు లేవు. రాజు కంగారు పడ్డాడు.

"ఇంతమందిలో ఒక్కరికీ దైవం మీద, యజ్ఞం మీద నమ్మకం లేదా?' అని ఆయన అనుకుంటూండగా దూరంగా ఆకాశంలో మబ్బు తునక ఒకటి కనిపించింది. క్రమేపీ నల్లటి దట్టమైన మేఘాలు కమ్మి కుండపోతగా వర్షం కురవసాగింది. ప్రజలంతా వర్షంలో తడుస్తూ ఆనందంగా నృత్యం చేయసాగారు.

"స్వామీ! ఆ విశిష్ట దైవభక్తి గలవారెవరు?" అడిగాడు రాజు.

పీఠాధిపతి లేచి ఓ ఐదేళ్ళ పిల్ల దగ్గరకి వెళ్ళి, ఆ పాపని ఎత్తుకుని చెప్పాడు.

"ఈ పాపవల్లే మనకి వర్షం లభించింది. ఈ పాపని తగిన రీతిలో సత్కరించండి."

అన్ని వేలమందిలో భగవంతుని దయవల్ల వర్షం కురుస్తుందన్న నమ్మకంతో గొడుగుతో వచ్చింది ఆ ఒక్కపాపే!

## 13. అవతలివైపు

ఓ డాక్టర్ దైవభక్తుడు. అతను తీరిక సమయాల్లో భగవద్గీత మీద తరచూ ఉపన్యాసాలు ఇస్తూంటాడు.

ఆయన రోగుల్లో ఒకతను నాస్తికుడు.

ఓ రోజు డాక్టర్ ఆ నాస్తిక కేన్సర్ రోగిని పరీక్షించాడు. ఎగ్జామినేషన్ రూమ్‌లోంచి బయటకి వెళ్ళేప్పుడు ఆ రోగి డాక్టర్‌తో చెప్పాడు.

"డాక్టర్! కేన్సర్ రోగానికి చికిత్స లేదుగా. నాకు చావంటే చాలా భయంగా వుంది."

"ఎందుకు భయం?" ప్రశ్నించాడు డాక్టర్.

"అవతలివైపు ఏముందో తెలీదు కాబట్టి. మీరు గొప్ప దైవభక్తులు కదా? అది మీరు చెప్పగలరా?"

"నాకూ తెలీదు." చెప్పాడు డాక్టర్.

"తెలీదా? మీకూ తెలీదా?" వెటకారంగా అన్నాడు ఆ నాస్తిక రోగి.

ఇంతలో బయటకున్న తలుపుని అవతలనించి ఎవరో గీకుతున్న శబ్దం వినిపించసాగింది. డాక్టర్ ఆ తలుపు తెరిచాడు.

వెంటనే అవతలి నించి డాక్టర్ పెంపుడు కుక్క లోపలికి వచ్చింది. అది డాక్టర్ కాలు నాకుతూ, తోకాడిస్తూ తన ఆనందాన్ని ప్రకటించసాగింది.

ఆ రోగివైపు తిరిగి నవ్వుతూ చెప్పాడు డాక్టర్.

"చూసారా? ఇంతదాకా ఈ కుక్క ఈ గదిలోకి ఎన్నడూ రాలేదు. దాని యజమాని అయిన నేను ఉన్నానన్న ఒక్క విషయం తప్ప, లోపల ఏముందో దానికి తెలీదు. తలుపు తెరచుకోగానే ఎలాంటి భయం లేకుండా లోపలకి వచ్చింది. అలాగే మరణానికి అవతలివైపు ఏముందో నాకు తెలీదు. కానీ దేవుడున్నాడని మాత్రం తెలుసు. కాబట్టి భయం లేకుండా అక్కడికి వెళ్ళగలను. భక్తుడికి, నాస్తికుడికీ గల తేడా ఇదే."

## 14. భూమి మీది దైవం

అనగనగా ఓ రోజు ఒక పసిపాప పుట్టడానికి సిద్ధంగా వుంది. ఆ పాప దేవుడి దగ్గరకి వెళ్ళి దుఃఖిస్తూ దీనంగా అడిగింది.